క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ కమర్షియల్ కాంప్లెక్స్ ఫీడర్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిస్ బ్యాంక్ రోడ్డు, గొల్లపూడి డైమండ్స్ అపార్ట్‌మెంట్ ఏరియా, టీటీడీసీ ఆఫీస్ ఏరియా, హైస్కూల్ ఏరియా, సీ అండ్ టీ టవర్స్ ఏరియా, బాలాజీ టవర్స్ ఏరియా, మహాత్మాగాంధీ కమర్షియల్ కాంప్లెక్స్, మహేందర్ నగర్, టెలికాం కాలనీ ఏరియా, అంబేడ్కర్ నగర్ ఏరియా, వ్యవసాయ మార్కెట్ ఏరియాలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

15 నుంచి పాండురంగడి బ్రహ్మోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామి వారి ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 15వ తేదీన స్వామి వారి సన్నిధిలో రుక్మాబాయి సమేత శ్రీ పాండురంగస్వామి వార్లకు పంచామృత తిరుమంజనం, పెళ్లికుమారుని, పెళ్లికుమార్తెను చేయటం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం స్వామి వారికి హంస వాహన సేవా కైంకర్యం, ఎదురుకోలు ఉత్సవాలు జరుగనున్నట్లు తెలిపారు. 16వ తేదీ ఉదయం స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం జరగనున్నట్లు తెలిపారు. సాయంత్రం వాహన సేవలు, సహస్ర దీపాలంకరణ సేవ ఉంటాయని పేర్కొన్నారు. 17వ తేదీన స్వామి వారికి పుష్పయాగం తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈనెల 18వ తేదీన స్వామి వారి పవళింపు సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఉత్తమ సేవా పురస్కారానికి శ్రీహర్ష ఎంపిక



భవానీపురం(విజయవాడపశ్చిమ): హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆలిండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పీవీకేఎస్ హర్ష ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపిక అయినట్లు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ అయ్యప్ప అరుణాచల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాధరపురానికి చెందిన పోతరాజు వెంకట కాశీ శ్రీహర్ష సంస్థ పక్షాన అందిస్తున్న సేవలకుగాను ఈ పురస్కారాన్ని వచ్చే నెల విజయవాడలో ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన మానవ హక్కుల పరిరక్షణ, బాధితులకు న్యాయం కలిగేలా సంస్థ ప్రతినిధులు విశేష సేవలు అందిస్తున్నారని, అందులో భాగంగా శ్రీహర్షకు ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉల్లాసంగా స్వామిదాసు



తిరువూరు: రెండు నెలల పాటు ఎన్నికల ప్రచారంలో తలమునకలైన తిరువూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు పోలింగ్ ముగియడంతో మంగళవారం ఉల్లాసంగా కనిపించారు. తిరువూరులోని తన నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో పోలింగ్ సరళిపై సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను తరలించడంలో కీలకపాత్ర పోషించిన కార్యకర్తలు, నాయకులను స్వామిదాసు అభినందించారు. పోలింగ్ సరళి వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉందని పలువురు నేతలు తెలిపారు.

రాజకీయ 'చదరంగం' వీడి.. కుటుంబంతో సరదా



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గత నాలుగు నెలల నుంచి ఎన్నికల హడావుడితో ఉన్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా మంగళవారం తన కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆటలు ఆడడం... వారికి నచ్చిన ఆహారాన్ని వండించి, కలిసి భోజనం చేసి రోజంతా కుటుంబానికే సమయం కేటాయించారు.

గోశాలకు ఆర్థిక సాయం

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీ తిరుపతమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు మంగళవారం గుంటూరు జిల్లా రాజుపాలెం గ్రామానికి చెందిన చేవూరు చిన్న నాగేశ్వరరావు రూ.20 వేలు విరాళం ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

పశ్చిమలో చైతన్యం అంతంత మాత్రమే

- 2019 ఎన్నికల్లో 66.17 శాతం పోలింగ్
- 2024 ఎన్నికల్లో 66.45 శాతం పోలింగ్
- ఓటు హక్కు వినియోగించుకున్న 1,70,104 మంది ప్రజలు



గొల్లపూడి డీఆర్‌డీఏ పీడీ కార్యాలయంలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు సోమవారం క్యూలో వేచి ఉన్న ఓటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ) పశ్చిమ నియోజకవర్గ ఓటర్లలో ఓటు హక్కు వినియోగంపై చైతన్యం అంతంతమాత్రంగానే ఉందని సోమవారం జరిగిన పోలింగ్ రుజువుచేస్తోంది. ఓటు హక్కు వినియోగంపై ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ ఓటర్లలో చైతన్యం తీసుకువచ్చి పోలింగ్ శాతం పెంచడానికి పలు చర్యలు చేపట్టాయి. అయినప్పటికీ పశ్చిమలో గత ఎన్నికలకు, ఈ ఎన్నికలకు పోలింగ్ శాతం పెరుగుదల నామమాత్రమే. అధికారులు సోమవారం రాత్రి హడావుడిగా పశ్చిమ నియోజకవర్గ పోలింగ్ శాతం 68 గా ప్రకటించారు. కానీ పూర్తి స్థాయిలో లెక్కలు వేసిన తరువాత ఆ శాతం సరికాదని స్పష్టమైంది. నియోజకవర్గంలో ఫైనల్‌గా 66.45 శాతం మాత్రమే పోలింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించారు. నియోజకవర్గ వ్యాపితంగా ఉన్న అన్ని పోలింగ్ బూత్‌ల నుంచి స్పష్టంగా సేకరించిన వివరాల ప్రకారం అధికారులు తాజా నివేదికలను తయారు చేశారు. అందులో పురుషులు, మహిళలు ఎంత మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు, మొత్తం ఓటర్లు... ఇలా అన్ని వివరాలను పొందుపరిచారు. ఆ నివేదికను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులకు సమర్పించారు. వాటిని అధికారికంగా ప్రభుత్వం మీడియాకు విడుదల చేసింది.

ఓటు వేసిన 1,70,104 మంది ఓటర్లు

పశ్చిమ నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో 1,70,104 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,55,963 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,26,634, మహిళలు 1,29,296 మంది ఉన్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో 85,255 మంది పురుషులు, 84,833 మంది మహిళలు ఉన్నారు. అయితే విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పశ్చిమ నియోజకవర్గంలోనే తక్కువ శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం.

గత మూడు ఎన్నికల్లో పెరుగుదల నామమాత్రమే

గడిచిన మూడు ఎన్నికల్లో పోలింగ్ శాతంలో పెరుగుదల నామమాత్రంగానే ఉంటూ వస్తోందని ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయి. 2024 ఎన్నికలకు సంబంధించి 66.45 శాతంకాగా, 2019 ఎన్నికల్లో 66.17 శాతంగా నమోదైంది. 2014 ఎన్నికల్లో 64.01 శాతంగా ఉంది. గత ఎన్నికలకు ఈ ఏడాదికి 0.28 శాతం మాత్రమే పెరిగింది. నియోజకవర్గంలో ప్రభుత్వ అధికారులు అనేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించినప్పటికీ ఓటింగ్ శాతం ఏమాత్రం పెరగకపోవటం గమనార్హం. వేసవి కాలం అవటం వలన కూడా పోలింగ్ శాతంపై ప్రభావం చూపినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఏషియన్ పవర్ లిఫ్టింగ్‌లో కేబీఎన్ విద్యార్థికి బంగారు పతకం



భరత్‌కుమార్‌ను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏషియన్ యూనివర్సిటీ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కాకరపర్తి భావనారాయణ కళాశాల విద్యార్థి పి.భరత్‌కుమార్ బంగారు పతకాన్ని సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు తెలిపారు. ఈ నెల తొమ్మిదో తేదీన చైనాలోని హాంకాంగ్‌లో జరిగిన ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న భరత్‌కుమార్ ఈ ఖ్యాతిని సాధించి తమ కళాశాల కీర్తిని, దేశ ప్రతిష్టను ఇనుమడింపజేశాడన్నారు. నగరానికి తిరిగి వచ్చిన భరత్‌కుమార్‌కు రైల్వే స్టేషన్ వద్ద కళాశాల తరఫున ఘనంగా స్వాగతం పలికి అక్కడి నుంచి కళాశాల విద్యార్థులు భారీ ప్రదర్శనగా తీసుకువచ్చారని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో భరత్‌కుమార్‌ను కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు సత్కరించి స్వాగతం పలికారు. భరత్‌కుమార్‌తో పాటు అతడిని తీర్చిదిద్దిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్రరావును అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లలో వెల్లివిరిసిన చైతన్యం

పాయకాపురం(విజయవాడరూరల్): సార్వత్రిక ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గం పరిధిలోని 61, 62, 63, 64వ డివిజన్లలో పోలింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికల్లో పోలైన ఓట్లతో పోల్చుకుంటే నాలుగు శాతం మంది అధికంగా ఈ డివిజన్‌లలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 61వ డివిజన్‌లో 11,934 మంది ఓటర్లకు గాను 8,175 మంది ఓట్లు వేశారు. అనగా 78 శాతం ఓట్లు పోలైనవి, అదేవిధంగా 62వ డివిజన్‌లో 72 శాతం అనగా 14,360 మంది ఓటర్లకు గాను 10,350 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. 63వ డివిజన్‌లో 17,902 మందికి గాను 12,902 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోగా 72 శాతం ఓట్లు పోలైనవి. 64వ డివిజన్‌లో 75 శాతం పోలైనవి. విజయవాడ నగరానికి శివారు ప్రాంతంలో ఉన్న ఈ నాలుగు డివిజన్లలో సగటున 71 శాతం ఓట్లు పోలైనవి. గత ఎన్నికలతో పోల్చుకుంటే నాలుగు శాతం మంది అదనంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని పరిశీలకులు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సక్రమంగా వినియోగించుకున్న వారు సంతృప్తి చెందినట్లుగా వారు అంటున్నారు. నగర శివారు ప్రాంతంలో అత్యధికంగా పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలు అధికంగా ఉండటం వారికి ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలతో పాటు ఇళ్లస్థలాలు పంపిణీ, జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి పథకాల పట్ల ఆకర్షితులై ఓట్లను ప్రభుత్వానికి అనుకూలంగా వేసినట్లుగా తెలుస్తోంది.

అభివృద్ధికి చిరునామా గొల్లపూడి

- డీబీటీ స్కీమ్స్ ద్వారా రూ.120 కోట్లు
- రూ.105 కోట్లతో నాన్ డీబీటీ ద్వారా ఇళ్ల స్థలాలు, ఇతర స్కీమ్స్
- రోడ్లు, డ్రెయిన్లు, భవనాలు, ఇతర నిర్మాణాలకు రూ.60 కోట్లు వ్యయం



ఆర్‌బీకె సెంటర్



వైఎస్సార్ మైనార్టీ కమ్యూనిటీ హాల్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ గొల్లపూడి గ్రామం అభివృద్ధిపథంలో పయనించింది. గత ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధికి ఈ గ్రామం చిరునామాగా మారింది. కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా మొత్తం రూ.285 కోట్లతో అభివృద్ధి సాధించింది. అందులో వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి రూ.120 కోట్లు డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ అయ్యింది. నాన్ డీబీటీ (ఇళ్ల స్థలాలు, ఇతర స్కీమ్స్) ద్వారా ఇచ్చినవాటి విలువ రూ.105 కోట్లు. ఇక రోడ్లు, సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్లు వంటి భవనాలు, సాయిపురం కాలనీలో వాటర్ ఫిల్టర్ బెడ్, ఇతర నిర్మాణాల విలువ రూ.60 కోట్లు. స్థానికుడు, శాసనమండలి సభ్యులు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురామ్ చొరవతోనే తమ గ్రామం ఇంతలా అభివృద్ధి చెందిందని పలువురు గ్రామస్తులు చెబుతున్నారు. ముఖ్యంగా రైల్ ఓవర్ రైల్వే ప్రాజెక్ట్‌లో భాగంగా రెండు ట్రాక్‌ల మధ్యలో మిగిలిపోయిన భూమిని కూడా రైల్వే శాఖ తీసుకునే విధంగా ఎమ్మెల్సీ తలశిల రఘురాం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతులకు తగిన నష్టపరిహారం వచ్చే విధంగా చేసిన కృషిని మరువలేమని రైతులు వ్యాఖ్యానిస్తున్నారు. కోవిడ్ కష్ట కాలంలో ఇంట్లో నుంచి బయటకు రాలేని నిస్సహాయ పరిస్థితుల్లో కూడా మేమున్నామంటూ గ్రామ వలంటీర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది వారి ఇంటికి వెళ్లి మెడికల్ కిట్స్ పంపిణీ చే శారు. ఆస్పత్రుల నిర్వాహకులతో మాట్లాడి అవసరం అయిన వారికి వైద్యం చేయించి వారి ప్రాణాలను కాపాడి తమ ఉదారతను చాటుకుంది తలశిల రఘురామ్ నేతృత్వంలోని గొల్లపూడి గ్రామ వైఎస్సార్ సీపీ.

గ్రామంలో అభివృద్ధి ఇలా..


- గ్రామ పంచాయతీ భవనం 2వ అంతస్తు నిర్మాణంతోపాటు మొత్తం భవనం ఆధునికీకరణ. గ్రామ ప్రజలకు పాలనాపరంగా అవసరమైన అన్ని సేవల నిమిత్తం ఐదు సచివాలయ భవనాలు. ఆరోగ్య పరిరక్షణకు ఐదు విలేజ్ హెల్త్ సెంటర్లు, రైతుల కోసం రెండు రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. ఇవి సేవలు అందిస్తున్నాయి.
- నాడు – నేడు ద్వారా గొల్లపూడిలోని జెడ్పీ స్కూల్, నల్లకుంటలోని ఎంపీయూసీ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా అభివృద్ధి చేశారు. ఎస్‌పీఎస్‌ఆర్‌సీ హైస్కూల్‌ను ప్రభుత్వ స్కూల్‌గా మార్చి దాని నిర్వహణకు దాతలు ఇచ్చిన ఏడు ఎకరాల భూమిని ఎండోమెంట్ శాఖకు అప్పగించి అన్యాక్రాంతం కాకుండా కాపాడారు.
- కృష్ణానదీ తీరాన వైఎస్సార్ స్నాన ఘాట్‌ను నిర్మించారు.
- గొల్లపూడి మౌలానగర్‌లో వైఎస్సార్ మైనార్టీ ఫంక్షన్ హాల్, సూరాయపాలెంలో దాత అందించిన విరాళంతో శ్రీఅభయ వీరాంజనేయ స్వామి బీసీ ఫంక్షన్ హాల్ నిర్మాణం జరిగాయి. ల్యాంకో కాలనీలో గొల్లపూడి బీసీ ఫంక్షన్ హాల్ నిర్మాణం పనులు శరవేగంతో జరుగుతున్నాయి.
- ప్రభుత్వ నిధులు, దాతల విరాళాలతో కృష్ణానది ఒడ్డున హిందూ శ్మశానవాటికను నిర్మించారు.
- గొల్లపూడి దళితవాడలో కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మించి వినియోగంలోకి తీసుకువచ్చారు. అలాగే అంబేడ్కర్ నగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులు, బొడ్డురాయి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి, కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి నిధుల కేటాయింపు.
- శ్రీనివాసనగర్, పోస్టాఫీస్ రోడ్, నేతాజీ నగర్, వస్త్రలత కాలనీ, ట్రిపుల్ ఎస్ కాలనీ, సాయిపురం కాలనీ, మౌలానగర్, నల్లకుంట, రామరాజ్య నగర్, దళితవాడ తదితర ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం. ముఖ్యంగా హైవే నుంచి గ్రామంలోకి వెళ్లే అన్ని రోడ్లకు అప్రోచ్ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం.
- గ్రామంలో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు దక్షిణ భారత దేశంలోనే తొలిసారిగా కంటైనర్ సబ్‌స్టేషన్ నిర్మాణం. గ్రామం మొత్తం ఎత్తైన విద్యుత్ స్తంభాలు, కొత్త లైన్ల ఏర్పాటు.
- గ్రామంలో నిరుపేదలైన 3,648 మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వటమే కాకుండా వాటికి రిజిస్ట్రేషన్ కూడా చేయించారు.

సేవ చేయడం కాదు..రుణం తీర్చుకోవడమే

మనం పుట్టి పెరిగిన గ్రామం కోసం పని చేయటం అంటే సేవ చేయడం కాదు..ముమ్మాటికీ రుణం తీర్చుకోవడమే అనే తలశిల రఘురామ్ మాటలను స్ఫూర్తిగా తీసుకుని గ్రామ పార్టీలోని ప్రతి నాయకుడు, కార్యకర్త సంఘటితంగా పని చేశాం. 2019లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామ అభివృద్ధితోపాటు పేదలకు ప్రభుత్వం అందించిన వివిధ సంక్షేమ పథకాలతో గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉండటం కంటే మాకు ఇంకా ఏం కావాలి. భవిష్యత్‌లోకూడా ఇదే అభివృద్ధి, సంక్షేమం కావాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొంటున్నారు గొల్లపూడి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు.



కంటైనర్ విద్యుత్ సబ్ స్టేషన్



విలేజ్ హెల్త్ సెంటర్

సెంట్రల్‌లో చారిత్రాత్మక ఓటింగ్

- భారీగా ఓటు హక్కును వినియోగించుకున్న ప్రజలు
- క్రాస్ ఓటింగ్ ఎవరికి లాభం



సోమవారం జరిగిన ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారా..? మళ్లీ తమ అభిమాన నేత నేతృత్వంలో నడిచే ప్రభుత్వం కావాలని కోరుకున్నారా..? తమ బాగోగులు చూసుకుంటున్న జననేతకు బాసటగా నిలిచేందుకే ఓటర్లు కదం తొక్కారా..? అంటే ఈ ప్రశ్నలన్నిటికీ అవుననే సమాధానం వినిపిస్తోంది. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మరోమారు రాష్ట్రంలో జగన్ జన సునామి వీయబోతున్నట్లుగా తెలుస్తోంది.

నియోజకవర్గంలో అత్యధిక ఓటింగ్ శాతం..

సోమవారం జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక ఓటింగ్ శాతంగా నమోదైంది. 2009లో నూతనంగా ఏర్పడిన ఈ నియోజకవర్గంలో ఏర్పాటైంది. అప్పటినుంచి నేటి వరకూ జరిగిన ఎన్నికల్లో నమోదైన ఓట్ల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

సెంట్రల్‌లో అ'ద్వితీయం'గా ఫ్యాన్ గాలి హోరెత్తిందా..

నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో ఫ్యాను గాలి హోరెత్తినట్లు తెలుస్తుంది. ప్రధానంగా ముస్లిం మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు వైఎస్సార్ సీపీకి అండగా నిలబడినట్లు తెలుస్తోంది. గతంలో కన్నా ఈ సారి మెజార్టీ చాలా ఎక్కువగా ఉంటుందని, సెంట్రల్‌లో అ'ద్వితీయం'గా ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడం ఖాయమంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు ధీమా ఉన్నారు.

క్రాస్ ఓటింగ్ ముప్పు ఎవరికో..

నియోజకవర్గంలో చాలా చోట్ల క్రాస్ ఓటింగ్ జరిగినట్లుగా తెలుస్తోంది. వైఎస్సార్ సీపీకి పునాదులుగా ఉన్న మహిళలు, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు టీడీపీ నాయకులు డబ్బు ఎర వేశారు. దీంతో కొంత మంది ఓటర్లు డబ్బులు తీసుకున్నాం కాబట్టి అటు ఒకటి.. ఇటొకటి వేసినట్లు సమాచారం. అయితే ఆ క్రాస్ ఓటు ఎవరికి లాభమవుతుంది.. ఎవరి తలమీద కుంపటిగా మారుతుందనేది ఎవరికీ అంతుపట్టడం లేదు. ఏది ఏమైనా ఈ ఎన్నికల్లో ఓటర్లలో చైతన్యం పెరగడం అందరూ ఆనందించాల్సిన విషయం. ఇక్కడ గెలుపు గుర్రం ఎవరిది.. ఎవరికి ఎన్నెన్ని ఓట్లు పడ్డాయి.. పెరిగిన ఓటు శాతం ఎవరికి బలంగా మారిందనే విషయాలన్నీ తెలియాలంటే జూన్ నాలుగో తేదీ వరకూ వేచి ఉండాల్సిందే.

ఎన్నికలు జరిగిన సంవత్సరం	మొత్తం ఓట్లు	నమోదైన ఓట్లు	ఓట్ల శాతం
2009	2,23,822	1,58,267	70.71
2014	2,59,001	1,70,463	65.81
2019	2,69,912	1,78,013	65.73
2024	2,77,724	2,02,635	72.96

మొరాయించిన ఈవీఎంలు

నందిగామ: నందిగామ నియోజకవర్గంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ ఉదయం సమయంలో బాగా మందకొడిగా సాగింది. అక్కడక్కడా కొద్దిసేపు ఈవీఎంలు మొరాయించాయి. ఆ తర్వాత సైతం అనేక చోట్ల ఈవీఎంలు నెమ్మదిగా పని చేయడంతో పలుచోట్ల రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపిన సమాచారం ప్రకారం.. నందిగామ నియోజకవర్గంలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా 9 గంటల సమయానికి కేవలం 4.46 శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. క్యూలైన్ లలో ఓటు వేసేందుకు బారులు తీరి కనిపించారు.

జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం జరిగింది. జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు మురళీధర్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక సామాన్య ప్రజల్లో మూఢనమ్మకాలను పోగొట్టి శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. కొండపల్లి పట్టణ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మామిడి సీతారామారావు, జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీమోహన్, ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఎస్.నాగరాజు, ప్రధాన కార్యదర్శి షేక్ సర్దార్ పాల్గొన్నారు.

నేటి నుంచి బాబా మందిర వార్షికోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరం 13వ వార్షికోత్సవాలు బుధవారం నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం ఆరు గంటలకు సంధ్యాహారతితో వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 6.30 గంటలకు గణపతి పూజ, పుణ్యావచనం ఉదయం తొమ్మిది నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి ఏకనామం జరుగుతాయన్నారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు సముద్రవేణి కోలాటం భక్త బృందం షిర్డీ సాయినాథుని ఊరేగింపుతో మధురానగర్ పురవీధులలో భిక్షాటన, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు బాబా మందిరం వార్షికోత్సవంలో పాల్గొని బాబావారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆమె కోరారు.

సూర్య భగవానునికి దశ సహస్ర గులాబీ అర్చన



మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీ శివజ్ఞాన పీఠంలో మంగళవారం సూర్యభగవానునికి పువ్వాడ కుసుమనాథ్ దంపతులచే పదివేల గులాబీలతో అర్చన జరిగింది. పీఠాధిపతి శివాచార్య సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి గులాబీలతో అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సూర్య భగవానుని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపు బాబాకు అభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైశాఖ మాసం సందర్భంగా ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం బాబాకు వెయ్యి మామిడి పండ్ల రసంతో అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు మామిడి పండ్ల రసంతో అభిషేకం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు స్వయంగా మామిడి పండ్లు తీసుకువచ్చి అభిషేకంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సదావకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నందిగామలో 90 శాతం పోలింగ్

నందిగామ: సార్వత్రిక ఎన్నికలలో ఈసారి కూడా ఓటర్లలో చైతన్యం కనిపించింది. స్థానికులతో పాటు పొరుగు రాష్ట్రాలలో ఉండేవారు సైతం సొంత గ్రామాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. నందిగామ నియోజకవర్గంలో ఆయా మండలాల్లో సోమవారం జరిగిన ఎన్నికలలో నందిగామ మండల పరిధిలో ఎక్కువ శాతం మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. నందిగామ పట్టణ పరిధిలో మొత్తం 36,492 మంది ఓటర్లు ఉండగా వారిలో 29,092(79.72) శాతం మంది వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నందిగామ మండల పరిధిలో మొత్తం 23,489 మంది ఓటర్లు ఉండగా వారిలో 21,420 (91.19) నియోజకవర్గంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.